

# విద్యుత్‌శాఖలో చేతివాటం







- ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతుల నుంచి భారీగా వసూళ్లు
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన అన్నదాతలు
- సంబంధిత అధికారిపై మొదలైన విచారణ
- నేడో రేపో చర్యలకు రంగం సిద్ధం

నిర్మల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యుత్‌శాఖలో కొంతమంది అధికారులు ఆ శాఖకు మచ్చ తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారు. ఉన్నతాధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సౌకర్యంను అందించడమే కాకుండా ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుండగా కొంతమంది కిందిస్థాయి అధికారులు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లంచావతారులుగా మారిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ఖానాపూర్ సబ్ డివిజన్ పరిధిలో ఈ వసూళ్లపర్వం పతాకస్థాయికి చేరుకుందంటున్నారు. మామడ మండలం పరిమండల్ గ్రామంలో రైతుల వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్ కోసం సంబంధిత ఏఈ రూ.1.50 లక్షలను వసూలు చేసిన వ్యవహారం ఆ శాఖలో దుమారం రేపుతోంది. అయితే రైతులు అధికారి తీరుపై విసిగిపోయి ఇటీవలే ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే సీరియస్‌గా స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లారు. ఏఈపై చర్యలు తీసుకునే అధికార పరిధి సీఎండీ ఆధీనంలో ఉండడంతో జిల్లా అధికారులు సంబంధిత ఏఈ వ్యవహారాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారని అంటున్నారు. సంబంధిత ఏఈతో పాటు మరికొంతమంది కిందిస్థాయి సిబ్బంది రైతుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులను వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. మామడ మండలంతో పాటు మరికొన్ని మండలాల్లో కూడా ఇదే తరహా లంచాల వ్యవహారం సాగుతోందని అంటున్నారు. కొంతమంది అధికారులు, సిబ్బంది కారణంగా విద్యుత్ సంస్థ అభాసు పాలవుతోందని అంటున్నారు. ఇటీవల ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ సంబంధిత శాఖలో సమూల సంస్కరణలు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్న క్రమంలోనే ఏఈ లంచాల వ్యవహారం వెలుగుచూడడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గతంలో కూడా విద్యుత్‌శాఖలో కొంతమంది అధికారులు అవకతవకలకు పాల్పడడంతో రైతులు ఆందోళనలు సైతం చేపట్టారు. ఇటీవల ఏసీబీ అధికారులు సైతం జిల్లాలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించి లంచాలు తీసుకుంటుండగా ఇద్దరు అధికారులను పట్టుకున్నారు. మొత్తానికి విద్యుత్‌శాఖలో లంచావతారుల వ్యవహారం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిందంటున్నారు.

### రైతులే బాధితులు

ఇదిలా ఉండగా కొంతమంది విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది రైతులను టార్గెట్ చేస్తూ మామూళ్ల పర్వానికి తెరలేపుతున్నారు. ముఖ్యంగా రైతులకు అవసరమయ్యే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లతో పాటు వ్యవసాయ విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల కోసం రైతులను టార్గెట్ చేస్తున్నారని చెబుతున్నారు. ఉచిత విద్యుత్ కారణంగా కొంతమంది సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం పెద్దమొత్తంలో లంచాలు గుంజుతున్నారని చెబుతున్నారు. అయితే రైతుల అమాయకత్వం కారణంగా వారు తమ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌శాఖ అధికారులకు మామూళ్లు చెల్లిస్తున్నారని చెబుతున్నారు. అవగాహన రాహిత్యం, అమాయకత్వం కారణంగా రైతులు అధికారులు అడిగినంత చెల్లిస్తుండడం వారికి వరంగా మారుతోందంటున్నారు. ఇప్పటి వరకు రైతులు ఫిర్యాదులు చేయకపోవడం అక్రమార్కులకు కలిసివచ్చింది. ఇటీవలే ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఎవరైనా లంచాలు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించడంతో మామడ మండలంలోని ఓ రైతు ముందుకు వచ్చి తనకు జరిగిన అన్యాయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై సీరియస్‌గా స్పందించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తీగలాగితే డొంక కదలబోతోందని అంటున్నారు.

### ఎమ్మెల్యేకు ఫిర్యాదుతో సమస్య సీరియస్..

కాగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రైతులకు జరుగుతున్న అన్యాయాలపై బలంగా గళమెత్తుతున్న కారణంగా సంబంధితశాఖ అధికారులు జంకుతున్నారు. విద్యుత్‌శాఖపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తుండడంతో ఎమ్మెల్యే ఈ దిశగా దృష్టి సారించారు. విద్యుత్‌శాఖ ద్వారా ఇబ్బందులు పడుతున్న బాధితులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిపి అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అలాగే తనకు అందిన ఫిర్యాదుల ఆధారంగా ఒక్కో అధికారి, సిబ్బంది వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. మొత్తం అవినీతి అధికారులు, సిబ్బంది చేతివాటాన్ని వెలుగులోకి తీసుకువచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా వారందరిపై చర్యలు జరిగేట్లు కూడా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకోబోతున్నారని అంటున్నారు.

### ఏసీబీ దృష్టికి

జిల్లాలోని విద్యుత్‌శాఖలో కొంతమంది అధికారులు, సిబ్బందిపై ఏసీబీ దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ కనెక్షన్‌ల కోసం పెద్దమొత్తంలో లంచాల వ్యవహారం సాగుతున్నట్లు ఏసీబీ అధికారులకు సైతం ఫిర్యాదులు అందాయని అంటున్నారు. అలాగే బాధితులు సైతం నేరుగా ఏసీబీకి ఫిర్యాదు చేశారని అంటున్నారు. అయితే ఇప్పటి వరకు సరియైన ఆధారాలు లభించకపోవడం, లోక్‌సభ ఎన్నికల సందడి ఉన్న కారణంగా ఈ దిశగా పెద్దగా పట్టించుకోలేదు. ఇక ఏసీబీ అధికారులు ఇప్పటికే పలుచోట్ల వరుస దాడులు జరుపుతూ అవినీతి అధికారులను పట్టుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జిల్లాలోని విద్యుత్‌శాఖపై కూడా ఏసీబీ నజర్ పెట్టిందని అంటున్నారు. కొంతమంది అధికారుల ఆస్తులు వారిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని చర్యలు తీసుకోతున్నారని అంటున్నారు. మొత్తానికి జిల్లా విద్యుత్‌శాఖలో కొంతమంది అధికారుల కారణంగా కొనసాగుతున్న లంచాల దందా వ్యవహారం ఆ శాఖలోని నిజాయితీ గల అధికారులు, సిబ్బందిపై కూడా తప్పుడు ప్రభావం చూపనున్నందున లంఛావతారుల విషయంలో పూర్తి ప్రక్షాళన జరగాలని పలువురు కోరుతున్నారు.

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



రైతులకు సంబంధిత పంట చేలల్లో ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, విద్యుత్‌తీగలు, స్తంభాల ఏర్పాటు విషయంలో కొందరు సిబ్బంది రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు మా దృష్టికి కూడా వచ్చింది. అలాంటి వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. రైతులు విద్యుత్ మరమ్మతుల పనుల కోసం ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన పని లేదు. ఎవరైనా విద్యుత్ శాఖ సిబ్బంది డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలి.

- ఎన్పీడీసీఎల్ నిర్మల్ జిల్లా ఎస్ఈ, బి. శ్రీనివాస్

## జిల్లా న్యాయాధికారిని కలిసిన కలెక్టర్



జిల్లా న్యాయాధికారికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : జిల్లా న్యాయాధికారి కే.కర్ణకుమార్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం జిల్లా కోర్టు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.. న్యాయాధికారికి పూలమొక్కను అందజేశారు.

## ప్రజలను ఆదుకునేందుకు సిద్ధం : ఎస్పీ డాక్టర్ జానకిషర్మిల



సామాగ్రి తనిఖీ చేస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీసుశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని ఎస్పీ జానకిషర్మిల తెలిపారు. శనివారం సాయుధదళ కార్యాలయంలో ఫ్లడ్ రిలీఫ్ సామాగ్రిని ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... భారీ వర్షాల వల్ల వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఎయిర్ బోట్స్, లైవ్ జాకెట్లు, ట్యూబ్స్, రోప్స్ తదితర సామాగ్రి ఉపయోగించి కాపాడేందుకు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. గతంలో జరిగిన నష్టాలు దృష్టిలో ఉంచుకొని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్ఐ రాము నిరంజన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం నేతలకు ఎమ్మెల్యే పరామర్శ

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : హైదరాబాద్ నాంపెల్లి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేవైఎం నాయకులను బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం పరామర్శించారు. టీజీపీఎస్ కార్యాలయ ముట్టడికి యత్నించిన బీజేవైఎం కార్యకర్తలకు, పోలీసులకు ఘర్షణ తోపులాటలో పలువురు గాయపడగా వారిని ఆసుపత్రిలో చేర్చారు. గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. దాడిని ఖండించారు. మహేష్, అనితా రెడ్డి గాయపడగా వారిని పరామర్శించారు.

## నీట్‌పై కొనసాగుతున్న నిరసనలు




నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి నిర్వహించాలన్న డిమాండ్‌తో నిర్మల్‌లో శనివారం నిరసన చేపట్టారు. భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ. పోలీసులు విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, కేంద్రం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. నాయకులు వినోద్, పవన్, ధ్రువ, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ముథోల్‌లో భారీ వర్షం

### 92.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



ముథోల్‌లోని ఇంట్లో చేరిన వర్షం నీరు

ముథోల్, జూన్ 22 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు సంబరపడిపోయారు. ముథోల్‌ని సాయి మాధవ్ నగర్‌తో పాటు కోట్‌గల్లీలోని మూడవ వార్డులలో పలువురి ఇళ్లలో వర్షం నీరు చేరింది. అలాగే మండలంలో 92.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

### వర్షానికి కూలిన ఇల్లు

లక్ష్మణచాంద, జూన్ 22 : మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మెరుగు స్వప్న ఇల్లు శనివారం కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో ఆమె కుటుంబానికి తలదాచుకునే చోటు లేకుండాపోయింది. కూలుతున్న విషయం గమనించి వెంటనే ప్రక్కనున్న రేకుల షెడ్డులోకి వెళ్లటంతో ప్రాణాప్రాయం తప్పింది కాగా ఇంటి సామాగ్రి తరలిస్తున్న క్రమంలో ఆమె పెద్ద కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. వంట సామాగ్రితో పాటు ఇంటి సామాగ్రి, దుస్తువులన్నీ కూలిన శిథిలాల క్రింద పడి పాడయ్యాయి. కొన్ని వస్తువులు వర్షంలోనే తడిసిపోయాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమెను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



మునిపెల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం .. మూగ జీవుల పాలిట శాపం



ఓలాలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఎద్దు

కుంటాల, జూన్, 22: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. కుంటాల మండలంలో మూగ జీవుల పాలిట శాపంగా మారింది. మండలంలోని ఓలా గ్రామంలో గత వారంలో గ్రామానికి చెందిన ఒక రైతు గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే. తాజాగా శనివారం మరో రైతుకు చెందిన ఎద్దు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారుల పనితీరుపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఓలా గ్రామానికి చెందిన కూస రాజేశ్వర్ అనే రైతు యొక్క ఎద్దు శనివారం మేతకు వెళ్లిన సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ. 90 వేల వరకు ఉంటుందని, వర్షాకాలం ప్రారంభం వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్న సమయంలో రైతు ఎద్దు మృతి చెందడంతో తాను వ్యవసాయం ఎలా చేసుకోవాలోనని ఆందోళనకు గురవుతున్నాడు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడం, లూజు లైన్ల కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పునరావాస గ్రామ ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- కొత్త మద్దిపడగ సమీపంలోని మైసంపేట, రాంపూర్ పునరావాస గ్రామ పరిశీలన



మైసంపేట, రాంపూర్ పునరావాస గ్రామాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖానాపూర్, జూన్ 22 : కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని మైసంపేట, రాంపూర్ గ్రామాలకు పునరావాసం కల్పించిన గ్రామంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కడెం మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో గల మైసంపేట్, రాంపూర్ గ్రామాల పునరావాస గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను గ్రామ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్తుల సమస్యలు విన్న కలెక్టర్ నష్టపరిహారం కింద అందించిన సాగు భూమిని సాగు యోగ్యంగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో గ్రామంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలని సూచించారు. ఖాళీ చేసిన గ్రామాల్లోని పాఠశాలలను ఇక్కడికి తరలించాలని అధికారులను ఆదేశించారు. మహిళల జీవనోపాధికై అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీలపై పైకప్పు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని స్థానిక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అటవీ శాఖ అధికారి ప్రసాద్, ఆర్డీవో రత్న కళ్యాణి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, తదితరులున్నారు.

### జాతీయ సదస్సుకు హాజరు కావాలని కలెక్టర్‌కు ఆహ్వానం అందజేత

నిర్మల్ కల్చరల్ : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28, 29న నిర్వహించే జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ప్రిన్సిపాల్ భీంరావు బృందం శనివారం ఆహ్వానపత్రం అందజేశారు. రసాయనశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిలో రసాయన, అనుబంధ శాస్త్రాల పాత్రపై రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. డాక్టర్ అరుణ్ కుమార్, పీజీ రెడ్డి, రవి కుమార్, శంకర్, రజిత, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## బాసర ఆలయంలో కంప్యూటరైజ్డ్ టికెట్‌లు

- కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనున్న ఆలయ అధికారులు

బాసర, జూన్, 22 : బాసర సరస్వతి దేవస్థానంలో కంప్యూటరైజ్డ్ టికెట్‌ల వ్యవస్థను అమల్లోకి తెచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎంట్రో లాబ్స్ సిబ్బంది ఈ ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంపై శనివారం దేవస్థాన కార్యాలయంలో ఆలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. త్వరలోనే ఇవి పూర్తి స్థాయిలో వాడుకలోకి తేనున్నట్లు ఆలయ ఈవో విజయ రామరావు తెలిపారు. ప్రస్తుతం దేవస్థానంలో పేపర్ టికెట్‌ల విక్రయాలు జరుపుతున్నారు. అద్దె గదుల కేటాయింపుతో పాటు పూజా టికెట్‌ల విక్రయాలు, వివిధ ఆర్జితసేవలు వంటి అన్ని టికెట్‌లు పాతపద్ధతిలో టికెట్‌లనే ఇస్తున్నారు. ఈ పేపర్ టికెట్‌లు రీసైక్లింగ్‌తో అక్రమాలు జరుగుతున్నాయే ఆరోపణలు ఉన్నాయి. ఒక టికెట్‌ను భక్తులకు అమ్మి తిరిగి వాటిని తీసుకొని మళ్లీ భక్తులకే విక్రయిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే తెలంగాణతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లో అక్కడి అధికారులు ఈ కంప్యూటరైజ్డ్ టికెట్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అక్కడ సత్ఫలితాలు ఉండడంతో దేవాదాయశాఖ అధికారులు బాసరలో కూడా అమలు చేయాలని నిర్ణయించారు.



సిబ్బందికి కంప్యూటరైజ్డ్ టికెట్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రైవేటు సంస్థ ఉద్యోగులు

## 'సరస్వతి పూజ'పై అధికారుల సీరియస్

- బాసరలో మహారాష్ట్ర స్వామి పూజలు నిర్వహించడంపై దేవస్థాన అధికారుల అభ్యంతరం
- బాసరలో ప్రైవేటు వ్యక్తులు పూజలు నిర్వహించడానికి వీల్లేదు.. నోటీసులిచ్చాం : ఈవో విజయ రామారావు

బాసర, జూన్, 22 : బాసర పుణ్యక్షేత్రంలో ప్రైవేటు వ్యక్తులు అక్షర శ్రీకారపూజలు వంటివి అనుమతి లేకుండా ఎవరూ నిర్వహించడానికి వీల్లేదు అంటూ బాసర సరస్వతి దేవస్థాన అధికారులు మహారాష్ట్ర మహారాష్ట్రలోని శ్రీ స్వామి సమర్థ గురు పీఠం సంస్థకు నోటీసులివ్వడం తీవ్ర చర్చకు దారి తీసింది. పూర్తి వివరాల్లోకి వెళితే ఈ నెల 16, 17 తేదీల్లో మహారాష్ట్ర శ్రీ స్వామి సమర్థ గురుపీఠం సంస్థ ఆధ్వర్యంలో సరస్వతి పూజా కార్యక్రమం జరిగింది. ప్రైవేటు స్థలంలో ధార్మిక సంస్థ పెద్దఎత్తున ఏర్పాట్లు చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మహారాష్ట్రలోని సుదూర ప్రాంతాలు, నలుమూలల నుండి ఈ రెండు రోజుల్లో సుమారు లక్ష మంది భక్తులు హాజరయ్యారు. సదరు ధార్మిక సంస్థకు మహారాష్ట్రలో లక్షల సంఖ్యలో భక్తులు ఉండడంతో సహజంగానే వారు చేపట్టిన కార్యక్రమం అనుకున్నదానికంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అయితే వారు సరస్వతి పూజ పేరిట అక్షర శ్రీకారపూజలు నిర్వహించారని బాసర దేవస్థాన అధికారుల ప్రధాన ఆరోపణ. బాసర గుడిలో జరిగే పూజలను ఓ ప్రైవేటు ధార్మికసంస్థ ప్రైవేటు కార్యక్రమంలో అది బాసరలో ఎలా నిర్వహిస్తారని దేవస్థాన అధికారులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు స్థలంలోనైనా దేవస్థాన అనుమతి లేకుండా అక్షర శ్రీకార పూజలు నిర్వహించడానికి వీలులేదని, అందుకే ధార్మిక సంస్థకు నోటీసులు జారీ చేస్తున్నట్లు ఆలయ ఈవో విజయ రామారావు ఆంధ్రజ్యోతితో తెలిపారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ధార్మిక సంస్థ గురూజీ (ఫైల్)

## సంక్షిప్త సమాచారం

### అవార్డు గ్రహీతకు సన్మానం

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ టి.వెంకట్‌రావు విద్యాదాత అవార్డు స్వీకరించిన సందర్భంగా ఆయనను నిర్మల్ టీడీపీ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభ వెలికి తీయడానికి ఈయన గత ఏడాది మీలో ఎవరు లక్షాధికారి కార్యక్రమం నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ ఈయనకు రవీంద్రభారతిలో విద్యాదాత అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల హన్మంతు, జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్‌కుమార్, ప్రకాష్, రాజులదేవి, శ్రీనివాస్, రమేష్, అనిల్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : నిర్మల్ పట్టణం సోఫీనగర్ ప్రాంతంలో శనివారం ఉర్సు ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హజరత్ సోఫీ హుస్సేన్ అలీషా ఖాద్రి వశుతార్ది రహమతుల్లాలై వారి 97వ శనివారం భక్తి ప్రపత్తుల మధ్య ప్రారంభమయ్యాయి. ముస్లిమత పెద్దలు దర్గా నిర్వాహకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : నిర్మల్ పట్టణంలోని వెంకటేష్ టాకీస్ లేడీస్ గేట్ వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతుడు సుమారు 40 నుండి 45 ఏళ్ల వయసు ఉన్నట్లుగా భావిస్తున్నామని, వివరాలు తెలిస్తే పట్టణ పోలీసు కేంద్రంలో సంప్రదించాలని పట్టణ సీఐ కోరారు.

### పైప్‌లైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చైర్మన్

నిర్మల్ కల్చరల్, జూన్ 22 : మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ శనివారం ప్రియదర్శిని నగర్‌లో కొనసాగుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పరిశీలించారు. మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు. లీకేజీ సమస్య పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

# నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్



పోగొట్టుకున్న వారికి బంగారు గొలుసు అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఉట్నూర్, జూన్ 22: పది రూపాయలు కింద కనబడితే కండ్లకు హత్తుకుని జేబులో పెట్టుకునే ఈ రోజుల్లో ఉట్నూర్ ఆర్టీసీ డిపో డ్రైవర్ వినోద్ రూ.75వేల విలువ గల బంగారు పుస్తెలతాడును నిజాయితిగా ప్రయాణికులకు అందించి తన నిజాయితిని చాటుకున్నాడు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి రాత్రి 8గంటలకు ఉట్నూర్ వస్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సులో ఇంద్రవెల్లికి చెందిన ప్రయాణికురాలు మడావి లక్ష్మి, భర్త మడావి సంజీవ్‌తో కలిసి ఉట్నూర్‌కు ఆదివారం ఉదయం చేరుకున్నారు. ఉట్నూర్‌లో కింద దిగుతుండగా బస్సులో పరుసు పడిపోయిన విషయం గమనించకుండా ఇంటికి వెళ్లి పోయారు. బస్సు డ్రైవర్ వినోద్ కంటికి పరుసు కనిపించడంతో అతను పర్సును ఆర్టీసీ డిపోలో అప్పగించారు పర్సులో ఉన్న గుర్తింపు కార్డుతో వారికి సమాచారం అందించడంతో బాధితులు డిపోకు చేరుకోగా డిపో అధికారులు డ్రైవర్ వినోద్ సమక్షంలోనే 75వేల విలువ గల తులంబంగారు పుస్తెలతాడు బాధితులకు అప్పగించినట్లు డిపో మేనేజర్ కల్పన తెలిపారు.నిజాయితి చాటుకున్న డ్రైవర్ వినోద్‌ను డీఎం కల్పనతో పాటు ఆర్టీసీ అధికారులు వీఆర్ కృష్ణ, వీటీరావు, గణేష్, మూర్తి, అజం తదితరులు డ్రైవర్ వినోద్‌ను అభినం దించారు.

# పోడు భూముల సమస్యను పరిష్కరించండి

బోథ్, జూన్ 22 : మండలంలో సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ మండలంలోని కౌటా(బి) గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులతో పాటు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గాజుల సురేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుగుణక్క శనివారం కలవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలు పోడు భూములు సాగు చేసుకుని ఎంతో మంది గిరిజన ఇతరులు జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే పోడు భూములకు పట్టాలు ఇవ్వకపోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందేమోనని ఆందోళన చేస్తున్నారు అని సుగుణక్క వివరించారు. స్పందించిన సుగుణక్క పోడు భూముల సమస్యపై డిఎఫ్‌వోతో సోమవారం మాట్లాడి రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకొస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. స్పందించిన సుగుణక్క పోడు భూముల సమస్యపై డీఎఫ్‌వోతో సోమవారం మాట్లాడి రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకొస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు సున్నపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సభ్యులు రాష్ట్ర జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గ జేష్ తదితరులు ఉన్నారు.

# అడవులు నరికే వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్ రూరల్, జూన్ 22: అడవుల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని యుగ తులసి పార్టీ నాయకులు సురేష్ అన్నారు. ఇటీవల దుర్గానగర్ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ పాటిల్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని అటవీ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

బోథ్, జూన్ 22: ఆదిలాబాద్ జిల్లాలో జిల్లా పరిషత్ సీఈవోగా పని చేసి కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఎంపీగా గెలుపొంది ఆ తరువాత రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించబడ్డ సిరిసిల్ల రాజయ్య శనివారం బోథ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బోథ్ అభివృద్ధి కోసం రాజయ్య హయాంలో ఎన్నో నిధులు మంజూరు చేశారని ఈసారి బోథ్ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్‌లు కోరారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.చంటి, ఆదివాసి కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ కొమరం కోటేశ్వర్, తదితరులు ఉన్నారు.

# గోడ కూలి మహిళ దుర్మరణం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 22: నిద్రపోతున్న ఓ మహిళపై గోడ కూలి ఆమె దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన రామ్ నివాస్ పాండే అనే వ్యక్తి తన భార్య ఉషా పాండే(43)తో కలిసి బ్రాహ్మణవాడలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కాగా శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఒక గదిలో నిద్రపోతున్న ఉషా పాండేపై భవనం గోడ కూలి పడింది. దీంతో గమనించిన కుటుంబీకులు గోడ శిథిలాల మధ్య ఇరుకున్న ఉషా పాండేను బయటకు తీసి రిమ్స్‌కు తరలించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసుకున్నట్లు వన్ టౌన్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

## ఉట్నూర్‌లో భారీ వర్షం.. పొంగిన వాగులు

ఉట్నూర్, జూన్ 22: ఉట్నూర్ మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 90 నిమిషాల పాటు ఏకతాటిగా కురిసిన భారీ వర్షానికి మండలంలోని నాగపూర్, షాంపూర్‌ల వద్ద ఉన్న వాగులు పొంగి పొర్లాయి. నాగపూర్ వాగు సమీపంలో రోడ్డుపై నుంచి వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు భయం భయంగానే నీటి నుంచి తమ వాహనాలను తీసుకు వెళ్లారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రధాన రహదారుల గుండా కాలువలు నిర్మించకపోవడంతో వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తుండగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలం ప్రారంభం నుంచి శనివారం కురిసిన భారీ వర్షంతో కాసింత ఊరట లభించిందని రైతులు ప్రజలు పేర్కొంటున్నారు.

## 'వర్షాల వల్ల కాలనీల్లో ముందస్తు చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 22: గత సంవత్సరం వర్షాల వల్ల ఆయా కాలనీల్లో నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గత సంవత్సర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు ప్రణాళికలు చేశారు. ఇందులో భాగంగానే పట్టణంలోని మహాలక్ష్మివాడ, జీఎస్ ఎస్టేట్, బంగారుగూడ, తాటిగూడ, దుర్గానగర్‌తదితర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టేలా అధికారులు బృందాలతో పాటు జేసీబీని అందుబాటులో ఉంచారు. గత సంవత్సరం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, నీరు ఇళ్లలో చేరిన ప్రాంతాలను గుర్తించి అక్కడ ముందస్తుగా అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఖమర్ అమ్మద్ మాట్లాడుతూ గత వర్షకాలంలో ఎక్కడెక్కడ వర్షపు నీరు వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారో వాటిని గుర్తించామన్నారు. ఆ కాలనీల్లో ముందస్తుగా చర్యలు తీసుకుంటూ ప్రజలకు అవసరమైన సూచనలు చేస్తామన్నారు. 20 మంది సిబ్బందితో పాటు జేసీబీని అందుబాటులో ఉంచామన్నారు.





# గొల్లఘాట్ రోడ్డు.. మూణ్నాళ్ల ముచ్చటేనా?

● ఒక్క వర్షానికే బురదమయమైన రహదారి ● పంటచేలకు వెళ్లేందుకు తప్పని తిప్పలు ● నామమాత్రపు పనులతో ఇక్కట్లు

భీంపూర్, జూన్ 22: భీంపూర్ మండలం మారుమూల సరిహద్దు గొల్లఘాట్ గ్రామస్థులకు ఇటీవల రోడ్డు వేశారు. కానీ స్థానికులకు రోడ్డు వేశారని సంతోషించాలో లేక ఆ రోడ్డు ఒక్క వర్షానికే బురదమయమైన ఇబ్బంది కారణంగా మారిందని బాధపడలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మండలంలోని పిప్పల్‌కోటి గ్రామ సమీపంలో బోర్లకుంట నుంచి ఐదు కిలో మీటర్ల రోడ్డును కాంట్రాక్టర్‌లు నామమాత్రంగా వేశారు. పనులు సక్రమంగా చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందంటున్నారు. దీంతో ఇప్పుడు స్థానికులకు కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో పంట చేలకు ఎడ్ల బండ్లలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాగే గోళ్లగడ్, నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల రైతులు ఈ రోడ్డు ద్వారా పంటచేలకు వెళ్తారు. అంతేకాకుండా ఆదిలాబాద్‌కు సైతం వెళ్లే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.





గోళ్లఘాడ్ నుంచి ఆదిలాబాద్ వైపు బైక్‌పై వెళ్తుండగా బురదలో ఇరుక్కున్న దృశ్యం



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న జూడాలు

## మా సమస్యలు పరిష్కరించాలి : జూడాలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 22: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడో రోజు రిమ్స్ జూనియర్ వైద్యులు డైరెక్టర్ కార్యాలయం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. జూడాల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు సందీప్ చారి మాట్లాడుతూ జూడాల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినా.. స్పందన రాకపోవడంతో విధులు నిర్వహిస్తూనే ఆందోళన కొనసాగిస్తున్నామన్నారు. సోమవారంలోగా ప్రభుత్వం స్పందించి నిర్దిష్టమైన హామీ ఇవ్వకపోతే సాధారణ విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జూడాల ఉపకార వేతనాల చెల్లింపునకు గ్రీన్ ఛానల్ విధానాన్ని అమలు చేయాలని, ఇతర డిమాండ్లన్నింటినీ పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెను కొనసాగిస్తూ ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రాజు యాదవ్, కార్తీక్ సూరజ్ పాల్గొన్నారు.

## ఉట్నూర్-ఆదిలాబాద్ మధ్య ప్రత్యేక బస్సులు నడపండి : ప్రయాణికులు

ఉట్నూర్, జూన్ 22: ఉట్నూర్ నుంచి జిల్లాకేంద్రానికి ఉట్నూర్ ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఉట్నూర్ కేంద్రంగా ఎన్నో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ఉద్యోగులు పని చేస్తున్నారని వారితో పాటు ప్రజలకు సైతం మేలు జరిగేలా ఆర్టీసీ అధికారులు చొరవ చూపెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఉట్నూర్ మీదుగా మంచిర్యాల,చ కరీంనగర్,వరంగల్, నర్సంపేట, ఆసిఫాబాద్ ప్రాంతాల ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. వాటిల్లో ఉట్నూర్ ప్రాంత ప్రయాణికులకు సీట్లు లభించక 90 నిమిషాల ప్రయాణం నిలబడి చేయాల్సి వస్తుందని, దీంతో వృద్ధులు మహిళలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు ప్రయాణికులు అంటున్నారు. గతంలో ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు నాన్‌స్టాప్ బస్సులు నడిచేవని, అవి రద్దు చేశాక వాటి స్థానంలో ఎక్స్‌ప్రెస్ బస్సులైనా నడిపంచాలని అధికారులు భావించక పోవడం బాధాకరమని ప్రయాణికులు వాపోతున్నా రు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రత్యేకంగా నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ప్రశాంతంగా పోల్ క్లైమింగ్ పరీక్షలు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 22: రెండు సంవత్సరాల క్రితం జూనియర్ లైన్‌మెన్ కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో ఎంపికైన వారికి దశల వారీగా పోల్ క్లైమింగ్ పరీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా శనివారం పోల్ క్లైమింగ్ పరీక్ష నిర్వహించాలని వచ్చిన ఆదేశాల మేరకు ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని స్థానిక కరెంట్ ఆఫీసులో వీటికి సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. అయితే ఇందుకు పది మంది అభ్యర్థుల్లో ఒకరు చనిపోగా.. మిగతా తొమ్మిది మంది పరీక్షకు హాజరయ్యారు. కాగా, వీరికి పోల్ ఎక్కించి వారి నైపుణ్యాన్ని పరీక్షించారు. పోల్ క్లైమింగ్ పరీక్షలో తొమ్మిది మంది హాజరు కాగా ఐదుగురు ఎంపికైనట్లు ఎస్ఈ జేఆర్ చౌహాన్ తెలిపారు.గతంలో కూడాజూనియర్ లైన్‌మన్ల భర్తీ కోసం పోల్ క్లైమింగ్ పరీక్షలు జరిగాయన్నారు. ఇక్కడ ఎంపికైన ఐదుగురిలో నిర్మల్‌కు ఇద్దరు, మంచిర్యాలకు ఇద్దరు, ఆదిలాబాద్‌కు ఒకరిని కేటాయించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా వీడియో ద్వారా పోల్ క్లైమింగ్ పరీక్ష జరిగిందని పేర్కొన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

## ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, జూన్ 22: తాంసి మండల పర్యటనకు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో గుడిహత్నూర్ మండల కేంద్రంలో గల ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలపై ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. ఆ తర్వాత బస్సులో ఎక్కి పలువురు ప్రయాణికులతో ముచ్చటించారు. అంతేకాకుండా బస్సులో ఉన్న విద్యార్థులతో సైతం మాట్లాడి వారి సమస్యలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న చిరు వ్యాపారులను పలుకరించారు. పలు మహిళలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ ఆయా ఫ్రీ టికెట్టుతో లొల్లి తప్ప లాభం లేదు సారు అని వాపోయారు. బస్సులో ఎక్కి సమస్యలు తెలుసుకుంటు తమతో ముచ్చటించినందుకు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. మాతో కలిసి మాల ఉండే ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాకు దొరకడం అదృష్టమన్నారు. అనంతరం సాధారణ వ్యక్తిలా బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులతో కలిసి టీ తాగుతు సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీరి వెంట బోథ్ నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

తాంసి, జూన్ 22: తాంసిలోని ఈదుల సావర్గావ్, మాజీ సర్పంచ్ భరత్ తండ్రి ఇటీవల మర ణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 'యువత గంజాయికి బానిస కావద్దు'

భీంపూర్, జూన్ 22: యువత గంజాయికి బానిస కావద్దని జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. ఆయన సీఐ మహ్మద్ కలీమ్‌తో కలిసి జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలో గిరిజన గ్రామం బెల్సారీ రాంపూర్‌లో గ్రామస్తులకు చెడు వ్యసనాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, గుట్కా, సిగరేట్‌కు బానిస కాకుండా ఉన్నత చదువులపై దృష్టిసారించి ఉన్నతమైన స్థానాలకు ఎదగనన్నారు. కొందరు విద్యార్థి దశ నుంచే వ్యసనాలకు బానిసలవుతున్నారని అలాంటి వారిని తల్లిదండ్రులు గుర్తించి మాన్పించాలన్నారు. గంజాయి సాగు చేసిన సరఫరా చేసిన అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఏక కాలంలో రుణమాఫీ పట్ల హర్షం

ఆదిలాబాద్ రూరల్/మావల, జూన్ 22: ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి మండలిలో రుణమాఫీపై నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని అన్నారు. 2022 మే 6న రైతు డిక్లరేషన్ సభలో ఆనాడు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పినట్టుగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గం దీనికి ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వం 28వేల కోట్లు రెండు దఫాలో చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రూ.31వేల కోట్లు మాఫీ చేయడం గొప్ప విషయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 22: రైతు రుణమాఫీపై మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేశారు. పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల అప్పుల్లో కూరుకున్న రైతులకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, లోకప్రవీన్ రెడ్డి, కలాల శ్రీనివాస్, రూపేష్ రెడ్డి, చారి పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో డిజిటల్‌కీ కష్టాలు

● నెల రోజుల క్రితం ఏసీబీకి పట్టుబడ్డ కమిషనర్
● డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకోని ఇన్‌చార్జీ కమిషనర్ ● నెల రోజులుగా నిలిచిన ధ్రువీకరణ పత్రాల జారీ

భైంసా, జూన్ 22 : భైంసా మున్సిపాలిటీలో డిజిటల్ కీ లేని కారణంగా నెల రోజులుగా ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచిపోయింది. ఇక్కడి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావ్ గత నెల 22న లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి జైలు పాలయ్యాడు. ఈ కారణంగా ఆయన సంతకంతో కూడిన డిజిటల్ కీ పని చేయకుండా పోయింది. దీంతో అప్పటి నుంచి మున్సిపల్ పరిధిలో జనన, మరణ ధృవీకరణ పత్రాలతో పాటు ట్రేడింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయింది. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లు నిర్వహించ లేని పరిస్థితులు నెలకొన్నాయి. డిజిటల్ కీ లేక మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి చాలా పనులు పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.



### ● డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకోని ఇన్‌చార్జి కమిషనర్

ఏసీబీకి పట్టుబడ్డ మున్సిపల్ కమీషనర్ స్థానంలో ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ సుదర్శన్‌రెడ్డి గత నెల 24న ఇన్‌చార్జీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఉత్తర్వుల మేరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ సుదర్శన్‌రెడ్డి తొలుత డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు విముఖత చూపినట్లుగా తెలిసింది. ఇన్‌చార్జి కమిషనర్ బాధ్యతలు నిర్వహించే విషయంలో ఆయన అనాసక్తితోనున్న కారణంగా డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకోనట్లుగా తెలిసింది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు రోజుల క్రితం ఈ ముద్ర ద్వారా ఆయన డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు చర్యలు చేపట్టినట్లుగా సమాచారం. అయితే ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సుదర్శన్‌రెడ్డికి సంబంధించిన ఆధార్, పాన్‌కార్డులలో ఆయన పేరులో అక్షరదోషాలు ఉండి సరితూగక పోవడం మూలంగా డిజిటల్ దరఖాస్తు తిరస్కరణ గురైనట్లుగా తెలిసింది. ప్రస్తుతం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సుదర్శన్‌రెడ్డి ఆధార్, పాన్ కార్డులో పేరులోని అక్షర దోషాలు సవరించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నట్లుగా సమాచారం. ఈ అక్షరదోష సవరణ ప్రక్రియ పూర్తయ్యేందుకు పక్షం రోజుల వ్యవధి పట్టే అవకాశం ఉంది. దీంతో అప్పటి వరకు డిజిటల్ కీ అందుబాటులోకి రానట్లే అని తెలిసింది.

### ● ధ్రువీకరణ పత్రాల కోసం ప్రదక్షిణలు

నెల రోజులుగా డిజిటల్ కీ లేని కారణంగా ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో జనన,మరణ ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర పత్రాల జారీ పూర్తిగా నిలిచిపోయింది. పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో రోజుకు కనీసం పాతిక మందికి పైగా శిశువులు జన్మిస్తారు. వీరందరికి కుటుంబ సభ్యులు తమ తమ ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో జనన ధృవీకరణ పత్రాల కోసం మున్సిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటారు. వీరందరికి మున్సిపల్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ విధానంలో మున్సిపల్ కమిషనర్ డిజిటల్ కీ ద్వారా ధృవీకరణ పత్రాల జారీ జరుగుతుంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం విద్యా సంవత్సరం ఆరంభంతో పాటు వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీకి రంగం సిద్ధమవుతోంది. ఇలాంటి తరుణంలో చాలా మంది విద్యార్థులు, అభ్యర్థులకు జనన ధృవీకరణ పత్రాల అవశ్యకతం ఏర్పడుతోంది. ఇలాంటి వారందరూ ధృవీకరణ పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటితో పాటు ట్రేడింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులు సైతం మున్సిపల్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంలో స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.




భైంసా మున్సిపల్ కార్యాలయం



## ముథోల్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలి

● ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఈఎన్‌సీలకు ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ విజ్ఞప్తి

భైంసా, జూన్ 22 : కాలయాపనకు తావులేకుండా నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగ్ చీఫ్ అధికారులకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఇర్రిగేషన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయాలకు వెళ్లి ఆయ శాఖల ఈఎన్‌సీలతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఇర్రిగేషన్ ఈఎన్‌సీకి నియోజక వర్గ పరిధిలోని గుండేగామ్ ముంపు బెడద, పునరావాసం, సిరాల ప్రాజెక్టు మరమ్మత్తులు, కాళేశ్వరం 27,28 ప్యాకేజీ పనుల వివరాలను వివరించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ ఈఎన్‌సీకి ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన వివిధ పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులు ఆన్‌లైన్ కాకపోవడం మూలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, బిల్లుల చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అత్యాచార యత్నం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్**

ఖానాపూర్, జూన్ 22 : కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈ నెల 20వ తేదీన ఒంటరి మహిళపై పట్ట పగలు నడిరోడ్డు మీద అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ప్రజా సంఘాల నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులకు నార్కోటెక్ టెస్టులు చేసి వారిపై అత్యాచార యత్నం, హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలన్నారు.

## భైంసా ప్రాంతంపై ప్రత్యేకదృష్టి సారించాలి

● కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ముథోల్ బీజేపీ ప్రతినిధుల విజ్ఞప్తి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో ముథోల్ బీజేపీ ప్రతినిధులు

భైంసా, జూన్ 22 : సమస్యాత్మకంగా మారిన భైంసా ప్రాంత సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కేంద్ర హోమ్‌శాఖ సహయ మంత్రి బండి సంజయ్‌కు ముథోల్ నియోజక వర్గ బీజేపీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.శనివారం ముథోల్ నియోజక వర్గ పార్టీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణరెడ్డి, రవి పాండే, ప్రతినిధులు ఏనుగు గంగారెడ్డి, గోపాల్ సర్దాలతో కూడిన బృందం కరీంనగర్‌లో కేంద్రమంత్రి సంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బాసర అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. భైంసా ప్రాంత సమస్యలను వివరించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో నమోదైన కేసుల వివరాలను తెలిపారు. భైంసా ప్రాంత పర్యటనకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్ పార్లమెంట్ సమావేశాల ముగిసిన అనంతరం తప్పనిసరిగా భైంసా ప్రాంత పర్యటన చేపడుతానని పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా.. (కిలో చొప్పున)

| | |
|---|---|
| టమాట కిలో రూ.80 | పువ్వుగోబి రూ.90 |
| వంకాయాలు రూ.80 | పచ్చిమిరపకాయలు రూ.100 |
| బీరకాయ రూ.90 | అలుచింతకాయలు రూ.60 |
| బెండకాయ రూ.80 | దోసకాయలు రూ.50 |
| దొండకాయ రూ.70 | క్యారేట్స్ రూ.80 |
| కాకరకాయ రూ.70 | మునగకాయలు రూ.80 |
| చిక్కుడుకాయ రూ.100 | పాలకూర రూ.120 |
| గోరుచిక్కుడు రూ.80 | మెంతికూర రూ.115 |
| సొరకాయ రూ.40 | కొత్తిమీర రూ.100 |
| సిమ్లామిర్చి రూ.70 | గంగవాయిలి (కట్ట) రూ.10 |
| ఆకుగోబి రూ.50 | ఉల్లిఆకు (కట్ట) రూ.10 |



రైతుబజార్‌లో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న వివిధ రకాల కూరగాయలు



# ధరలు.. పైపైకి..

- జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న కూరగాయల ధరలు
- సామాన్యుడిని రారెత్తిస్తున్న టమాటాలు
- వండకుండానే కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి
- కోయకుండానే చిటపటలాడుతున్న పచ్చి మిరపకాయలు
- బెంబేలెత్తిస్తున్న బీరకాయలు
- యేటా సీజన్ ప్రారంభంలో ఇదే పరిస్థితి
- ధరల నియంత్రణపై అధికారులకు ముందుచూపు కరువు
- గడ్డు పరిస్థితుల్లోనూ రైతులకు అవగాహన కల్పించని అధికారులు
- ధరలు ఉడికిపోతున్నా.. పట్టించుకోని ఉద్యానవన శాఖ
- జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో నమోదు కాని వర్షపాతం

ఆదిలాబాద్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో కూరగాయల ధరలు సగటు మనిషిని అతలాకుతలం చేస్తున్నాయి. అసలే జిల్లాలో నీటి వనరులు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి. యాసంగిలో సాగు చేసిన పంటలను తొలగించి వానాకాలం పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధం కావడంతో కూరగాయల సాగు గణనీయంగా పడిపోయింది. దీంతో ధరలు మరింత పైపైకి వస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుకపోవడంతో అక్కడక్కడ బోరుబావుల కింద కూరగాయలను సాగు చేసే పరిస్థితులు కూడా లేవంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు గడిచిపోతున్న ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు. జిల్లాలో జూన్ 1నుంచి 22వరకు 131.1 మి.మీ.ల వర్షపాతం కురవాల్సి ఉండగా.. 117.0 మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదైంది. అంటే మైనస్ 11.0 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. మావల, నేరడిగొండ మండలాల్లో అధిక లోటు వర్షపాతం కనిపిస్తోంది. గత పక్షం రోజులుగా పైపైకి వస్తున్న కూరగాయల ధరలతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నా రు. పెరిగిన ధరలతో కూరగాయల జోలికి వెళ్లకుండా పప్పుదినుసులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందంటున్నారు. ఇలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొనేం దుకు పంటల సాగుకు రైతులను సమయాత్తం చేయాల్సిన హార్టికల్చర్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. వానాకాలం సీజన్‌లో కూరగాయల సాగుకు అనుగుణంగా విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయినా ఇప్పటి వరకు ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసినట్లు కనిపించడం లేదు. అయితే రైతులే సొంత అనుభవంతో స్వయంగా కూరగాయాల సాగును చేస్తున్నా.. సంబంధిత శాఖ అధికారుల సలహాలు, సూచనలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదంటున్నారు.

### సెంచరీ కొట్టిన మిర్చి

ప్రతియేటా జూన్, జూలై మాసాలలో కూరగాయల ధరలు భారీగా పెరుగుతున్నా.. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు. దీంతో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అలాగే సాగు విస్తీర్ణం ఘననీయంగా తగ్గిపోయి దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఇప్పటికే పచ్చిమిర్చి సెంచరీ దాటిపోవడంతో టమాట రూ.80, వంకాయ రూ.80, బీరకాయ రూ.90, బెండకాయ రూ.80, దొండకాయ రూ.70, చిక్కుడు రూ.100, గోరుచిక్కుడు రూ.80, పాలకూర రూ.115, కాకరకాయ రూ.70, సోరకాయ రూ.40, ఆకుగోబి రూ.50, పువ్వుగోబి రూ.90కి చేరుకుంది. నిన్నమొన్నటి వరకు కిలో చొప్పున కొనుగోలు చేసిన వినియోగదారులు.. ప్రస్తుతం పావుకిలో తోనే సరిపెట్టుకుంటున్నారు. కొందరైతే వేసవి ఎండలు ముగిసే వరకు కూరగాయల జోలికి వెల్లకపోవడమే మంచిదంటున్నారు. అధికారులకు ముందుచూపు లేకపోవడంతోనే ఇలా కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయని జనం మండిపడుతున్నారు. ధరల నియంత్రణకు కనీస చర్యలు చేపట్టకపోవడం సరైంది కాదంటున్నారు.

### పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి

వానాకాలంలో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల సాగును చేపట్టే విధం గా అన్నదాతల్లో అవగాహన కల్పించాలి. కానీ జిల్లాలో ఎక్కడా అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ఉద్యానవన శాఖాధికారులు కార్యాలయానికి పరిమితం కావడంతో కూరగాయల సాగు గణనీయంగా పడిపోతుంది. రైతులకున్న సాగు అనుభవంతోనే అక్కడక్కడ సాగు చేస్తున్నప్పటికీ జిల్లాలో డిమాండ్‌కు సరిపడా.. కురగాయల సాగు కావడంలేదని తెలుస్తుంది. దీంతో పొరుగు రాష్ట్రమైన మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూరగాయలను భారీగా దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. నిత్యం వ్యాపారులు హోల్‌సెల్‌గా కూరగాయలను దిగుమతి చేస్తూ అధిక ధరలకు అమ్మేస్తున్నారు. జిల్లాలో దిగుబడులు లేకపోవడంతో గత్యంతరం లేక అధిక ధరలకు కొనుగోలు చేస్తూ అమ్మేస్తున్నారు. అలాగే రైతులకు విత్తనాల ఎంపికలో అవగాహన లేకపోవడంతో దిగుబడులు తగ్గి నష్టాల పాలవుతున్నారు. పొరుగు రాష్ట్రాలపై ఆధారపడడంతోనే రవాణా చార్జీల ఖర్చు భారం పెరిగిపోయి.. ధరలు అమాంతంగా పెరుగుతున్నాయని వినియోగారులు చెబుతున్నారు. అంతేకాకుండా స్థానికంగానే కూరగాయల సాగును చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థితి ఉండదంటున్నారు.



### ఏం కొనే పరిస్థితి లేదు..

**: అమిర్‌ఖాన్, సోనార్‌కాలనీ వాసి, ఆదిలాబాద్**



గత పక్షం రోజుల వరకు రూ.40 పలికిన టమాట ధర.. ప్రస్తుతం రూ.80కి పెరగడంతో కొనే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రతీ వంటలో టమాట తప్పనిసరిగా ఉంటుంది. మొన్నటి వరకు కిలో, రెండు కిలోల వరకు కొనేవాళ్లం. ప్రస్తుతం అర కిలోతో సరిపెట్టుకుంటున్నాం. తక్కువ ధరలు ఉన్న కూరగాయలనే కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఎందుకు ధరలు పెరుగుతున్నాయో? అర్థం కావడం లేదు.

### మార్కెట్లో ధరలు మండిపోతున్నాయి

**: తూకారెడ్డి నడిపెన్న, తంతోలి గ్రామం, ఆదిలాబాద్ రూరల్**



ప్రస్తుతం గ్రామాల్లో పంటల సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఎక్కడ కూరగాయల సాగు కనిపించడం లేదు. దిగుబడులు లేక ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. ధరలు పెరుగడంతో కంది పప్పు, పెసర పప్పు, మినపప్పులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. కూరగాయలను కొనేబదులు పావుకిలో చికెన్ కొనుకుంటే మంచిదని అనిపిస్తుంది. చికెన్ ధరల కంటే కూరగాయల ధరలే అధికంగా ఉన్నాయి. ఏది కొన్న పావుకిలోతోనే సరిపెట్టుకుటున్నాం.

## సంక్షిప్త సమాచారం

### 'స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి సెలక్షన్ పోటీలు'

జైనథ్, జూన్ 22: మండలంలోని ఆయా గ్రామాల్లో గల విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్స్ నాలుగవ తరగతిలో ప్రవేశం కోసం మండల స్థాయిలో సెలక్షన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి ఎంపిక పోటీలను ఈనెల 24న ఉదయం 10గంటలకు జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అల్లూరి దయనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఈ పోటీలకు వచ్చే విద్యార్థులు విద్యార్థుల ఆధార్ జిరాక్స్, బోనఫైడ్ జిరాక్స్, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

### తైబజార్, స్లాటర్ హౌజ్ వేలం

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 22: 2024-25 సంవత్సరానికి పట్టణంలోని తైబజార్, స్లాటర్ హౌజ్ వేలం పాటను మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేలంలో తైబజార్, స్లాటర్ హౌజ్‌లను దక్కించుకున్నారు. కాగా తైబజార్ వేలంలో బిడ్డర్లు పోటీ పడ్డారు. చివరికి 9నెలలకు గాను మీర్జా అమ్రిన్‌బేగం తైబర్ వేలం దక్కించుకున్నారు. అదేవిధంగా స్లాటర్ హౌజ్‌కు 9నెలలకు గాను ఇష్తేకార్ అహ్మద్ రూ.లక్షా 16 వేలకు దక్కించుకున్నారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. 9నెలల పాటు వీరికి టెండర్ ఇస్తూ పత్రాలను అందించడం జరిగిందన్నారు. వచ్చిన నిధులతో మున్సిపల్ అభివృద్ధికి కేటాయిస్తామని పేర్కొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నేరడిగొండ, జూన్ 22: పేదింటి బిడ్డకి కల్యాణలక్ష్మి పథకం ఒక వరమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఆయన నివాసంలో ఆయ గ్రామాలకు చెందన 53మంది లబ్ధిదారులకు రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.53,06,148 ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి బిడ్డలకు ఒక వరమని, తెలంగాణ రాష్ట్ర సాధనకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల కోసం ఈ పథకాన్ని అందించి దేశానికి దిక్సూచిగా నిలిచారన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదింటి బిడ్డకి తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షకాలం ప్రారంభమైన నేటికీ రైతుబంధు అందించలేదని, వెంటనే నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్‌సజన్, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ నానక్‌సింగ్, రవీందర్‌రెడ్డి, జహీర్, శ్రీనివాస్‌రెడ్డి, శివారెడ్డి, కుంట కిరణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మహేష్, ఎంఆర్‌ఐ నాగోరావు, మీరాబాయి, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### 'కాలనీ సమస్యలు పరిష్కరించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 22: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలని పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌ను వేర్వేరుగా కలిసి విన్నవించారు. కాలనీ సమీపంలోని గోవధశాలను తొలగించాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్య తీర్చాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఇందులో దయాకర్, ప్రణయ్ చారి, త్రియంబక్, ఎర్రన్న, రాందాస్, ఉన్వర్ పాల్గొన్నారు.

# పకడ్బందీగా హాస్టల్ వెల్ఫేర్ పరీక్ష

- అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- అధికారుల సమావేశంలో కలెక్టర్ రాజార్షిషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 22: టీజీపీఎస్‌సీ సీబీఆర్‌టీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ (వర్క్స్ గ్రేడ్ -2) పరీక్షలకు సంబంధించి శనివారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా తన చాంబర్‌లో లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 29 వరకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష, జూన్ 30నుంచి జూలై 4వరకు డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షలు జిల్లాలోని నలందా డిగ్రీ, పీజీ కళాశాల, మావల పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్‌లకు అనుమతి లేదని సూచించారు. పోలీసు బందోబస్తుతో పాటు అబ్జర్వర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ప్రత్యేకాధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, మహిళ పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు. సకాలంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకునేందుకు ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలని, ఉదయం, సాయంత్రం బస్‌లు నడిచేలా బస్సుల సంఖ్య ఎక్కువగా ఏర్పాటు చేయాలని పలు సూచనలున్నారు. ఈ సమావేశంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు డీఎస్పీ జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యం**

**ఆదిలాబాద్ అర్బన్:** మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళ శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులకు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు, మహిళ శక్తి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళ ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళ శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టు పనిని వారికే అప్పగించిందని మహిళ శక్తి కింద మైక్రో ఎంట్రప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువుల, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, పౌల్టీ మదర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళ క్యాంటిన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, కస్టం హైరింగ్ కేంద్రాలు 15 రకాల కార్యకలాపాలు చేపట్టేందుకు మండల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యచరణ ప్రకారం వివిధ మండలాల్లో గల మహిళ సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యచరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతులకు ఔత్సాహికులైన క్రియాశీలక మహిళ సంఘాల సభ్యులను ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులపై ఆరా తీసి ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి, ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సాయన్న, ఎస్ఈ ఎన్‌డీపీసీఎల్, ఎల్‌డీఎం, డీఏహెచ్‌వో, డీపీవో, డీపీఎం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన సర్టిఫికెట్ల పరిశీలన!

- పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదలకాక ఉపాధ్యాయుల ఆందోళన
- స్పందించిన గిరిజన సంక్షేమ శాఖ



సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించిన అధికారులు

ఉట్నూర్, జూన్ 22: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల కాక గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే దీనికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో ఈనెల 17న 'బదిలీలు అయ్యేనా?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించారు. గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రతీరోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆయా పాఠశాలల్లో పదోన్నతులు, బదిలీలు కల్పించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలుపుతున్నారు. కాగా, అధికారులు చేపడుతున్న సర్టిఫికెట్ల పరిశీలన టీచర్ల ఆందోళనలు అదుపు చేయడానికేనని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**మల్టీజోన్ అధికారి నియామకం లేకుండానే!!**

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల పదోన్నతుల బదిలీలు చేయడానికి ముందు మల్టీజోన్ ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించాల్సి ఉంటుంది. ఇదేమీ లేకుండా కంటి తుడుపు చర్యగా అధికారుల ముందుకు వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ గిరిజన విద్యా విభాగంలో 243 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ టీచర్ల పదోన్నతులు, బదిలీలు పొందాల్సి ఉంది. వీరితో పాటు ఫిజికల్ డైరెక్టర్లు సైతం పదోన్నతులు పొందాల్సి ఉంది. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులు కల్పించాలంటూ గత కొన్ని రోజులుగా నిరసనలు తెలుపుతున్నారు. బాసర, కాళేశ్వరం, రాజన్న సిరిసిల్లా, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి ఐదు జోన్లను కలుపుకొని ఒక మల్టీజోన్ చేసి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాల్సి ఉంటుంది. దీని కోసం గిరి జన సంక్షేమ శాఖ అధికారులు శుక్రవారం హుటాహుటిన ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్‌సీ సమావేశ మందిరంలో స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్లు, ఎల్ఎఫ్ఎల్ టీచర్లకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభించారు. బదిలీల షెడ్యులు విడుదల, మల్టీజోన్ అధికారిని నియమించినప్పుడే ప్రక్రియ పూర్తవుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెండ్యాల విజయశేఖర్, మేస్రం గంగారాం, మడవి లక్ష్మణ్, ఆత్రం భుజంగరావులు పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసి, అధికారి నియమించాలని డిమాండ్ చేశారు. అయితే ఆదేశాలు వచ్చేలోగా సీనియార్టీ జాబితాను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.